



చాబాల-ధర్మపురి తారురోడ్డు

ఇకపై.. రయ్.. రయ్..!

మూడు గ్రామాల ప్రజల దశాబ్దాల సమస్య తీరింది. విడపనకల్లు, ఉరవకొండ మండలాల పరిధిలో దెబ్బతిన్న దారులు కూటమి ప్రభుత్వం రాకతో బాగుపడ్డాయి. చాబాల-జనార్దనపల్లి ధ్వంసమైన దారిలో వాహనదారులకు నరకం కనిపించేది. 1989 నుంచి ఈ రోడ్డు గురించి ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. వైసీపీ హయాంలో మరింత నిర్లక్ష్యానికి గురైంది. కూటమి అధికారం చేపట్టాక చాబాల-ధర్మపురి బీటీ రోడ్డు పనులు మొదలయ్యాయి. రెండు నెలల వ్యవధిలో రూ.70 లక్షలకు పైగా ఖర్చు చేసి 3.5 కి.మీ. తారు రోడ్డును నిర్మించారు. చాబాల, ధర్మపురి ప్రజలు ఇన్నాళ్లూ విడపనకల్లుకు వెళ్లాలంటే ఉరవకొండ మీదుగా ప్రయాణించేవారు. ఇకపై ఆ అవసరం లేకుండా.. నేరుగా వెళతామని ప్రజలు సంతోషంగా చెబుతున్నాఆరు. నెల క్రితం కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ప్రారంభించిన ఆర్.కొట్టాల-గడేకల్లు రోడ్డు పనులు కూడా పూర్తి అయ్యాయి.

- ఆంధ్రజ్యోతి, ఉరవకొండ, విడపనకల్లు



వైసీపీ హయాంలో ఇలా ఉండేది..

సంక్రాంతి సందడి

పల్లెలు.. పట్టణాల్లో కోలాహలం

ముంగిట ముత్యాల ముగ్గులు.. నింగిలో గాలి పటాలు..! ఊరి బయట కోడి పందేలు..! పల్లెలు, పట్టణాలలో ఒకటే సందడి. సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉద్యోగాలు, ఉపాధి, చదువుల కోసం ఊరికి దూరంగా వెళ్లిన అం దరూ సొంతూళ్లకు చేరుకున్నారు. ఇంటింటా కోలాహలం కనిపిస్తోంది. సోమవారం వేకువ జామున భోగి మంటలతో వేడుకలు మొదలయ్యాయి. పలు ప్రాంతాల్లో చిన్నారులకు భోగి పండ్లు పోశారు. కొత్త బట్టలు, పండుగ సరుకులు, పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. అనంతపురం నగరవాసులు గొబ్బెమ్మల కోసం చివరకు పేడను కూడా కొనుగోలు చేశారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



అనంతపురం: రంగు రంగుల పూలు.. ముగ్గుల సింగారానికి..



అనంత మార్కెట్‌లో బంతిపూల రాశులు..



పేడ.. బంగారం.. కొనాల్సిందే..!



పచ్చ పచ్చని తోరణాలకు.. మామిడి ఆకులు..



అనంతపురం: బంధుమిత్రులు వచ్చారు.. బాగా వండి పెట్టాలిగా...



ఎంతందంగా ఉన్నాయో.. ఎక్కడెక్కడ విరబూసి వచ్చాయో..

తిరిగిరాని సంక్రాంతి..!

ఒక్కరి మరణంతో ఆగిన పండుగ
వేడుకలకు దూరం.. బోదపాటి వంశం

ఆత్మకూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటేనే సంబరాల పండుగ. బంధుమిత్రుల రాకతో ఇంటికి కొత్త కళ వస్తుంది. ముత్యాల ముగ్గులు పరుచుకున్న నేల.. ఎగిరే గాలి పటాల ఆకాశం ఏకమౌతాయి సంక్రాంతికి. కానీ ఆత్మకూరు మండలంలోని పి.కొత్తపల్లికి చెందిన ఒక వంశంవారు ఈ సంబరాలకు తరతరాలుగా దూరంగా ఉంటున్నారు. పండుగ సరుకులకోసం వెళ్లిన ఒకరు తిరిగిరాని లోకాలకు వెళ్లడమే దీనికి కారణం. బోదపాటి వంశానికి చెందిన ఆ వ్యక్తి మరణంతో ఇప్పటికీ పండుగను చేసుకోవడం లేదు. పండుగ జరపుకుంటే తమకు కీడు జరుగుతుందని వారు నమ్ముతారు. అందుకే తమ పూర్వీకుల నుంచి సంబరాలకు దూరంగా ఉంటున్నామని ఆ వంశస్థుల్లో ఒకరైన బోదపాటి వెంకటేసులు అన్నారు. 'సంక్రాంతి పండుగకు పిండి వంటలు చేసుకోము. ఇంటి ముందు ముగ్గు వేయం. కొత్త బట్టలు కొనుగోలు చేయం. ఊరంతా పండుగ చేసుకుంటున్నా.. మేము పండుగ జోలికి వెళ్లం..' అని ఆ కుటుంబాలవారు అంటున్నారు. 'మా వంశంలో ఆడపడుచులు పెళ్లి చేసుకుని వెళ్లాక.. అత్తారింటిలో పండుగ చేసుకుంటారు. కానీ ఈ ఇంటికి వచ్చిన కోడళ్లు ఆచారం ప్రకారం పండుగకు దూరంగా ఉంటాం..' అని అనసూయమ్మ అనే మహిళ అన్నారు. తమ వంశీయులు వేర్వేరు ప్రాంతాలలో స్థిరపడ్డారని, ఎక్కడున్నా ఆచారాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు.



పండుగ చేయం...



మా ఊరిలో నా చ్నిప్పటి నుంచి పండుగ చేయడం లేదు. సంక్రాంతికి దూరంగా ఉండాలని మా పెద్దలు నిర్ణయించారు. వారి మాటలకు కట్టుబడి ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. మా వంశస్థులు అందరం పాటిస్తున్నాం.

- బోదపాటి వెంకటేసులు

పుట్టింటి సంక్రాంతే చివరిది..



మా పుట్టింట్లో ఉండగా సంక్రాంతి చేసుకున్నాను. పెళ్లి చేసుకుని అత్తవారి ఇంటికి వచ్చాక పండుగ చేయలేదు. నా భర్త కుటుంబం ఆచాచారాన్ని కొనసాగిస్తున్నాం. మా పిల్లలు కూడా పాటిస్తున్నారు. సంక్రాంతికి మా ఇంటి ముందు ముగ్గులు ఉండవు. రెండు రోజులపాటు కఠినంగా నియమాలు పాటిస్తాం.

- బోదపాటి అనసూయమ్మ

ఆచారం కదా.. తప్పదు..



సంక్రాంతి సెలవులు వస్తే అందరిలాగా పండుగ చేస్తే బాగుంటుందని అనిపిస్తుంది. కానీ మా పెద్దల కాలం నుంచి పాటిస్తున్న ఆచారాన్ని వదులుకోలేము. ఇంటి ముందు ముగ్గులు వేయాలని ఉన్నా.. వేయడం లేదు.

- బోదపాటి చైతన్య

రాష్ట్రాభివృద్ధే సీఎం లక్ష్యం

18న లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంపు
ప్రభుత్వ విప్ కాలవ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గంటౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని ఉభయ రాష్ట్రాల్లో ఈ నెల 18న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో 500 మంది దాతలతో రక్తాన్ని స్వీకరించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 30వేల మంది దాతలతో రక్తాన్ని సేకరించి, ప్రజలకు వినియోగించడానికి ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమము, అభివృద్ధి సమానంగా ముందుకు తీసుకెళ్లడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, టీడీపీ నాయకులు టంకశాల హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌లే దిక్కు

- ఇరిగేషన్‌లో ఇన్‌చార్జ్‌ల పాలన
- కీలక పోస్టుల్లోనూ కింది స్థాయి అధికారులే
- మైనర్ ఇరిగేషన్, హంద్రీనీవా ఎస్ఈలు ఖాళీ
- హెచ్ఎన్ఎస్ఎస్‌లో నాలుగు ఈఈ పోస్టుల్లో డీఈలే
- కీలక సమయంలో అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు



మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కీలక పోస్టులకు అధికారులు లేకపోవడంతో జలవనరులశాఖను ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. జిల్లా జలవనరుల శాఖలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం, తుంగభద్ర ఎగువ కాలవ (టీబీపీ హెచ్చెల్సీ), మైనర్ ఇరిగేషన్ విభాగాలు ఉన్నాయి. హెచ్చెల్సీ ఎస్ఈగా రాజశేఖర్ ఉన్నారు. ఈయన ఏడాది కాలంలో రిటైర్డ్ కానున్నారు. మైనర్ ఇరిగేషన్ ఎస్ఈగా ఉన్న శ్రీనివాసులురెడ్డి ఆరు నెలల కిందట ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి డ్వామాలో క్వాలిటీ కంట్రోల్ ఈఈగా పనిచేస్తున్న విశ్వనాథ్‌రెడ్డి ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగుతున్నారు. హంద్రీనీవా ఇన్‌చార్జి ఎస్ఈగా ఉన్న దేసేనాయక్ మూడు నెలల కిందట నెల్లూరుకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సీఈ నాగరాజ అదనపు బాధ్యతలతో కొనసాగుతున్నారు. ఎస్ఈ పోస్టుల సంగతి అలా ఉంచితే ఆ తరువాత స్థాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) పోస్టులలో కూడా ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు పూర్తయినా రెగ్యులర్ ఇంజనీర్లను నియమించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక జలవనరుల శాఖలో ప్రధానమైన క్వాలిటీకంట్రోల్ ఈఈ పోస్టులో జోన్‌లో డీఈగా పని చేస్తున్న రమేష్‌బాబు అదనపు బాధ్యతలతో కొనసాగుతున్నారు.

డీఈలకు ఈఈలుగా బాధ్యతలు

హంద్రీనీవా డివిజన్-5కి డీఈ శ్రీనివాస్‌నాయక్ ఇన్‌చార్జి ఈఈగా ఉన్నారు. డివిజన్ -6కి అదే డివిజన్‌లో డీఈగా పనిచేస్తున్న శ్రీనివాసులు ఈఈగా(ఎఫ్ఏసీ) బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డీఈ వెంకటేశ్వర్లుశెట్టి ధర్మవరం ఇన్‌చార్జి ఈఈగా కొనసాగుతు న్నారు. ఇక పెనుకొండ డివిజన్ ఈఈగా డీఈ మురళీకృష్ణ(ఎఫ్ఏసీ) బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇలా ఎస్ఈతో పాటు కీలకమైన పోస్టులు ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. ప్రస్తుత శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవాకు నీటి సరఫరా జరుగుతోంది. అయితే ఇన్‌చార్జిలు ఉండటంతో నీటిని అధికంగా తీసుకోవడానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. హంద్రీనీవా కాలవ 216 కిలోమీటరు జీడిపల్లి నుంచి కదిరి 400కిలోమీటర్ వరకు కాంక్రీట్ లైనింగ్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.936కోట్లు నిధులు మంజూరు చేసింది. పైగా కర్నూలు జిల్లా సరిహద్దు నుంచి 88కిలోమీటర్లు జీడిపల్లి కాలవ వెడల్పు పనులకు రూ.250కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ పనులన్నీ సక్రమంగా జరగాలంటే రెగ్యులర్ ఇంజనీరింగ్ అధికారులు ఉండాలి. అయితే ఆయా ప్రాంతాల్లో మొత్తం ఇన్‌చార్జి ఈఈలు, ఇన్‌చార్జి డీఈలే కొనసాగుతున్నారు.

హెచ్చెల్సీలోనూ అదే పరిస్థితి...

అనంతపురం జిల్లాకు ప్రధాన నీటి వనరైన టీబీపీ హెచ్చెల్సీలోనూ ఇన్‌చార్జ్‌ల పాలనే సాగుతోంది. హెచ్చెల్సీ డివిజన్‌లో రెగ్యులర్ ఈఈ శ్రీనివాసులు రెండు నెలల కిందట ఉద్యోగ విరమణ పొందారు. దీంతో నంద్యాలలో డీఈగా పనిచేస్తున్న శరత్‌బాబును డెప్యుటేషన్ కింద నియమించారు. ఇక డీబీసీ(ధర్మవరం బ్రాంచ్ కెనాల్) డివిజన్‌లో డీఈగా ఉన్న వెంకటరమణ జీబీసీ(గుంతకల్లు బ్రాంచ్ కెనాల్) ఇన్‌చార్జి ఈఈగా పని చేస్తున్నారు. వెంకటరమణ జీబీసీ ఇన్‌చార్జి ఈఈగా ఉన్నప్పటికీ వారంలో ఒక్కరోజు కూడా గుంతకల్లుకు వెళ్లడం లేదని, జిల్లా కేంద్రంలోనే తిష్ట వేసుకున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. హెచ్చెల్సీలో రూ.36కోట్లతో 11పనులు చేపడుతున్న నేపథ్యంలో ఇన్‌చార్జ్ అధికారులు ఉండటం వల్ల పనులలో జాప్యం జరుగుతోందనే వాదన వినిపిస్తోంది. ఈఈలతో పాటు డీఈ పోస్టుల్లోనూ జేఈలే ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతుండటం గమనార్హం. ప్రధానంగా టీబీ డ్యాం నుంచి ప్రస్తుతం నీటిని తరలిస్తున్నారు. కాలవ సరిహద్దు వెంబడి నీటి చౌర్యం లేకుండా, ఎక్కడా కాలువకు గండ్లు పడకుండా చూడాల్సిన బాధ్యత ఆయా ఇంజనీర్లదే. మరి ఇన్‌చార్జ్‌లు ఎంతమేరకు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారోననే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



హంద్రీనీవా కార్యాలయం

మైనర్ ఇరిగేషన్‌లో ..

జలవనరుల శాఖలో మైనర్ ఇరిగేషన్ పరిధిలోకే చెరువులు వస్తాయి. వీటి కట్టలను ఎప్పటి కప్పుడు మరమ్మతులు చేసి, నీరు లీకేజీ కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులకు ఉంటుంది. హంద్రీనీవా, హెచ్చెల్సీ, వర్షం ద్వారా వచ్చే నీటితో ఆయా చెరువులను నింపుతూ ఎక్కడ గండ్లు పడకుండా, తెగిపోకుండా చూడాలి. ఇవన్నీ సమన్వయం చేసుకుని ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టుకోవాల్సిన బాధ్యత కీలకంగా ఉండే సూపరింటెండెంట్ ఇంజనీర్‌పైనే ఉంటుంది. ఈఈగా ఉన్న విశ్వనాథ్‌రెడ్డి ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగుతున్నారు. తాడిపత్రి డీఈగా ఉన్న రాము అనంతపురం ఐబీ డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ధర్మవరం ఈఈగా ఉన్న నారాయణ నాయక్ నెల రోజుల కిందట ఎల్ఎల్‌సీ ఈఈగా బదిలీ కావడంతో హెచ్చెల్సీ డీబీసీ డివిజన్ ఈఈగా ఉన్న అబ్దుస్ సమీకి అదనపు బాధ్యతలు అప్పగించారు.

త్వరలో వస్తారు..



త్వరలో జలవనరుల శాఖ పరిధిలోని అన్ని కీలక పోస్టులను రెగ్యులర్ ఇంజనీర్లతో భర్తీ చేస్తారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పరిపాలన సౌలభ్యం కోసం పలు పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. ప్రమోషన్లు రావాల్సిన ఇంజనీర్లు చాలామంది ఉన్నారు. వారందరికీ ఉద్యోగోన్నతులు వస్తే అన్ని పోస్టుల్లోనూ రెగ్యులర్ అధికారులే ఉంటారు.

- నాగరాజ, జలవనరుల శాఖ జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ



ప్రత్యేక పూజలు అందుకుంటున్న స్వామివారు

సంగమేశ్వరుడికి అభిషేకం

కూడేరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భోగి పండుగను పురస్కరించుకుని సోమవారం వేకువ జామునే జోడులింగాల సంగమేశ్వర స్వామికి అభిషేకం చేశారు. పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. కూడేరులో భోగి మంటలు వేసి వేడుకను సంబరంగా జరుపుకున్నారు. మూడు రోజులు పాటు జరిగే సంక్రాంతి సంబరాల్లో భాగంగా తొలి రోజు భోగి మంటలు వేసి, రెండో రోజున ఇంటి ముందు అందమైన ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి, రైతులు పండించిన ధాన్యాన్ని అందులో పోసి ఇంటి గుమ్మడి కాయలను కొడతారు. మూడో రోజు కనుమతో ముగిస్తుంది.

రైతుల ఖాతాల్లోకి భూ పరిహారం



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

ఉరవకొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ కింద భూమి కోల్పోయిన రైతులకు పరిహారం మంజూరైంది. ఏళ్ల తరబడి పరిహారం ఎదురు చూస్తున్న రైతుల గురించి గతంలోనే 'ఆంధ్రజ్యోతి'లో ఇంకా ఎన్నేళ్లు శీర్షికన ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భములు కోల్పోయిన రైతుల ఖాతాల్లోకి రూ.16.7కోట్లు జమ అయ్యాయి. హంద్రీనీవా ఉపకాలువ కోసం లత్తవరం గ్రామానికి చెందిన 30 మంది రైతుల నుంచి, 35ఎకరాల భూమిని సేకరించగా రూ.3.37కోట్ల పరిహారం రైతుల ఖాతాల్లోకి జమ అయ్యింది. అలాగే ఆమిద్యాల, సొల్లాపురం లిఫ్ట్ రైతులకు, పెద్దకౌకుంట్ల, పెద్దముష్టూరు రైతులకు రూ.13. కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల్లోనే మంత్రి కేశవ్ నిధులు మంజూరు చేయించి, తన చిత్తశుద్ధిని చాటుకున్నారని రైతులు కొనియాడుతున్నారు.

అనంతలో శిక్షణ.. అద్భుత విజయం

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతగా రాష్ట్ర పురుషుల జట్టు



విజేతగా నిలిచిన ఏపీ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అనంత వేదికగా శిక్షణ పొందిన ఏపీ పురుషుల జట్టు జాతీయ స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచింది. మహిళల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈనెల 11 నుంచి 13వతేదీ వరకు పాండిచ్చేరిలో 21వ సీనియర్స్ నేషనల్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కేరళపై మూడు పాయింట్ల తేడాతో గెలుపొందిన ఏపీ పురుషుల జట్టు విజేతగా నిలిచింది. మహిళల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్లను అనంతపురంలోనే ఎంపిక చేసి, ఇక్కడే శిక్షణ ఇచ్చారు. ఈ జట్లలో జిల్లాకు చెందిన క్రీడాకారులే ఎక్కువ ఉండటం గమనార్హం. రెండు జట్ల క్రీడాకారులను ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కూన రవికుమార్, నాగేంద్ర, సీఈఓ వెంకటేశులు అభినందించారు.

నలుగురు ఈఈలకు

అడహక్ ప్రమోషన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో పనిచేస్తున్న నలుగురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా అడహక్ పదోన్నతి కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ జీఓ నంబరు 12 జారీ చేశారు. ఇందులో ప్రధానంగా హెచ్చెల్సీలో డిప్యూటీ ఎస్ఈగా పనిచేస్తున్న సూర్యభాస్కర్ శర్మ, లోక్ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న రెడ్డి శేఖర్‌రెడ్డి, డీబీసీ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న అబ్దుస్‌సమీలతో పాటు మైనర్ ఇరిగేషన్ ఇన్‌చార్జి ఎస్ఈగా పనిచేస్తున్న ఈఈ విశ్వనాథ్‌రెడ్డిలకు అడహక్ ప్రమోషన్ కల్పించారు. అయితే వీరికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్, హంద్రీనీవాలో ఎస్ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరి వీటిలో ఎవరికి అవకాశం కల్పిస్తారో చూడాలి. మైనర్ ఇరిగేషన్ ఇన్‌చార్జి ఎస్ఈగా ఉన్న విశ్వనాథ్‌రెడ్డి టీబీ డ్యాం ఎస్ఈగా వెళ్లేందుకు ఆసక్తి చూపుతూ, ఆదిశగా పావులు కదుపుతున్నట్లు సమాచారం.

రేపు బ్యాంకులకు సెలవు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బ్యాంకులకు ఈనెల 15న కనుమ సందర్భంగా సెలవు ప్రకటించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జీఓ నంబరు 73జారీ చేశారు. మొదట సంక్రాంతి పండుగకు ఈనెల 14వతేదీ ఒకరోజే బ్యాంకులకు సెలవు ప్రకటించారు. అయితే బ్యాంకు ఉద్యోగుల సంఘాల వినతి మేరకు బుధవారం కనుమ పండుగ రోజును సెలవుగా ప్రకటించారు.

అపరిచితుల మాటలు నమ్మొద్దు

- డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, జనవరి13(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యఆరోగ్యశ్రీ సొమ్మును ఇప్పిస్తామని ఫోన్ చేస్తూ పలువురు మోసం చేస్తున్నారని, అలాంటి అపరిచితుల మాటలు నమ్మవద్దని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు సోమవారం ఓప్రకటనలో సూచించారు. ఇటీవల కొందరు ఆస్పత్రికి వచ్చే అమాయక రోగులే లక్ష్యంగా ఆరోగ్యశ్రీ ద్వారా ఆర్థిక సదుపాయము ఇప్పిస్తామని మోసం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అందుకే అపరిచితుల మాటలు నమ్మకూడదన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఎవరికైనా అందే సాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాలకే జమ అవుతుందన్నారు. మీకేదైనా అనుమానం ఉంటే నేరుగా వచ్చి ఆస్పత్రిలో కలవాలని రోగులకు ఆయన కోరారు.

అగ్రిగోల్డ్ భూముల్లో మరో దోపిడీ

కలప అమ్మేందుకు రంగం సిద్ధం

పుట్లూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్య ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో మరో దోపిడీకి వైసీపీ నాయకుడు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఈయన ఆ భూముల్లో వంద ఎకరాలకు పైగా సాగు చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ భూముల్లో 60 ఎకరాల్లో ఏళ్ల తరబడి ఏపుగా పెరిగిన కంప చెట్లను కొట్టి కలపను అమ్మేందుకు సిద్ధం అవుతున్నాడు. దాదాపు 20 ట్రాక్టర్లకు పైగా కలప ఉన్నట్లు తెలిసింది. ట్రాక్టర్ కలప రూ.10వేలు చొప్పున విక్రయానికి పెట్టినట్లు సమాచారం. ఈమేరకు అనంతపురానికి చెందిన ఓ బట్టి వ్యాపారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. దీంతో ఆ వ్యాపారి ఇప్పటికే ఆ భూముల్లోని ఏపుగా పెరిగిన కంపచెట్లను పరిశీలించి వెళ్లినట్లు తెలిసింది. ఆ గ్రామంలో అగ్రిగోల్డ్ భూమి 217ఎకరాలు ఉంది. అక్కడ ఆ వైసీపీ నాయకుడు చెప్పిందే వేదం. ఆ భూముల్లోకి అధికారులు అయినా, ఇతర వ్యక్తులు ఎవరైనా రావాలంటే ఆయన అనుమతి ఉండాల్సిందే.

మోక్షమెప్పుడో..?

- ఆగిన ప్రభుత్వ భవన నిర్మాణాలు
- అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా భవనాలు
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న ప్రజలు



కలుగోడులో ఆగిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్

గుమ్మఘట్ట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నిధుల కొరతతో మండలంలోని పలు ప్రభుత్వ భవనాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. వైసీపీ పాలనలో మండలంలో ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాల నిర్మాణాలు ప్రారంభించారు. తొలుత సచివాలయ భవనాలకు రూ. 30 లక్షలు, ఆర్‌బీకే భవనాలకు రూ. 23 లక్షలు, హెల్త్ క్లినిక్‌లకు రూ. 20 లక్షల చొప్పున గత ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తామని చెప్పడంతో కాంట్రాక్టర్లు భవన నిర్మాణాలను ప్రారంభించారు. వీటికి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఉపాధి నిధులను గ్రామ సర్పంచ్ నిధులతో అనుసంధానించి భవన నిర్మాణాలు ప్రారంభించారు. అయితే పంచాయతీలకు కూడా నిధులు కొరవడటంతో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేక పోయారు. దీంతో కొన్ని నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. మండలంలో 15 గ్రామ సచివాల యాలు 90 శాతం పూర్తయ్యాయి. సచివాలయ సిబ్బంది వీటిలో అనధికారికంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. పది పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది అద్దె భవనాలు, ఇతర పంచాయతీ కార్యాలయాలలో ఐదేళ్లుగా కార్యకలాపాలు కొనసాగిస్తూ వస్తున్నారు. అర్ధంతరంగా ఆగిపోయిన భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిపోయాయి. మండలంలోని గొల్లపల్లి, గలగల, కలుగోడు, బీటీపీ, రంగచేడు, 75 వీరాపురం, గోనబావి, గుమ్మఘట్ట గ్రామాలలో ప్రభుత్వ భవనాలు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. పూలకుంట, బేలోడు, భూపసముద్రం, శిరిగేదొడ్డి గ్రామాల్లో సచివాలయ భవనాలు పూర్తయినా వాటిని ప్రారంభించలేదు. అధికారులు మాత్రం వాటిని అనధికారికంగా వాడేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా నిధులను మంజూరు గ్రామ సచివాలయం, ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుమ్మఘట్టలో ఆగిన సచివాలయ భవనం

వినియోగంలోకి తేవాలి



గత ప్రభుత్వంలో ఆగిన ప్రభుత్వ భవనాలకు ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పూర్తిచేసి వినియోగంలో తేవాలి. గత పాలనకు నేటి పాలనకు ప్రజలు తేడా గుర్తించేలా వాటిని అభివృద్ధి చేయాలి.

- రవీంద్ర, గుమ్మఘట్ట

అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలు



గ్రామాల్లో అర్ధంతరంగా ఆగిన ప్రభుత్వ భవనాల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం భవన నిర్మాణాలు పూర్తి చేస్తే ఇలాంటి వాటికి అడ్డుకట్ట పడుతుంది. భవనాలు వినియోగంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

- ఆంజనేయులు, జే వెంకటంపల్లి

ప్రజాధనం వృథా కాకూడదు



గ్రామాల్లో నిర్మించిన ప్రభుత్వ భవనాలకు లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించారు. అదంతా వృథా కాకుండా ప్రస్తుత ప్రభుత్వం వాటి నిర్మాణాలను పూర్తి చేసి, వినియోగించాలి. సర్పంచుల నిధులతో పూర్తి చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలి.

- రాజశేఖర్, వ్యాపారి, గుమ్మఘట్ట

భవనాలు పూర్తి చేస్తాం



గ్రామాల్లో 80 శాతం పూర్తయిన సచివాలయ భవనాలను పూర్తి చేసుకునేందుకు ఆయా సర్పంచులకు వెసులుబాటు కల్పించాం. మిగతా భవన నిర్మాణాలకు పూర్తి చేసేందుకు ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. భవనాలను పూర్తి చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- రామకృష్ణుడు, ఎంపీడీఓ, గుమ్మఘట్ట

మాయదారి మత్తు..!

- గంజాయి మత్తులో యువత
- స్పృహలేని స్థితిలో దారుణాలు
- పట్టించుకోని పోలీసులు.. ఇబ్బంది పడుతున్న ప్రజలు

తాడిపత్రి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోగంజాయి విక్రయాలు, వినియోగం జోరుగా సాగుతోంది. మత్తులో దారుణాలకు పాల్పడుతున్నారు. పోలీసులు ఈ గొడవలను సీరియస్‌గా తీసుకోవడం లేదు. కొన్ని రోజుల కిందట నందలపాడు, టైలర్స్ కాలనీ, భగత్‌సింగ్‌నగర్, కూరగాయల మార్కెట్, నంద్యాలరోడ్డు, పాతకోట, సుంకులమ్మపా లెం, విజయనగర్‌కాలనీ, అంబేడ్కర్‌నగర్, ఏటిగడ్డపాలెం తదితర ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌పై పోలీసులు దాడులు చేశారు. కొందరిని మాత్రమే అరెస్ట్ చూపించి చేతులు దులుపుకున్నారు. యల్లనూరు రోడ్డులో గంజాయి బ్యాచ్ పట్టపగలే రాళ్లతో దాడులు చేసుకున్నారు. నంద్యాల రోడ్డులోని విశాల్‌మార్ట్ సమీపంలో కూడా దాడులు జరిగాయి. నెల కిందట కృష్ణాపురం జీరో రోడ్డులో కాలేజీ విద్యార్థినిని కామెంట్ చేస్తున్న సమయంలో అక్కడే ఉన్న బేల్దార్లు శంకర్, సుబ్బరాయుడు, నాగేంద్ర మందలించారు. వారిపైనా గంజాయి బ్యాచ్ రాళ్లతో దాడి చేసింది. కృష్ణాపురం ఆరో రోడ్డులో గంజాయి బ్యాచ్ 40 రోజుల కిందట హల్‌చల్ చేయడంతో ఒక వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అతడి ఇంటిపైకి వెళ్లి దాడి చేశారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నా పోలీసులు నామమాత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భగత్‌సింగ్‌నగర్‌లో నూతన ఇంటి నిర్మాణంలో గంజాయి బ్యాచ్ ఉన్న వీడియో వైరల్ అయింది. కానీ వారిని ఇంతవరకు అరెస్ట్ చేసిన పాపానపోలేదు. వీరికి అనంతపురం, గుంతకల్లు, బళ్లారి తదితర ప్రాం తాల నుంచి ఎక్కువగా రైలు మార్గంద్వారా గంజాయిసరఫరా అవుతోందని సమాచారం.

బయటికెళ్లాలంటే భయం

గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు మితిమీరడంతో విద్యార్థినులు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. విద్యార్థినులను కళాశాలలకు పంపించాలంటే తల్లిదండ్రులున జంకుతున్నారు. యల్లనూరు, కృష్ణాపురం జీరో రోడ్డు, పుట్లూరు రోడ్డు ప్రాంతాల్లో కాలేజీలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌ల సంచారం ఎక్కువైంది. కుటుంబ సభ్యులు వెంట వెళ్లి పిల్లలను కాలేజీల్లో వదలాల్సి వస్తోంది. ఇప్పటికే పలువురు కళాశాల నిర్వాహకులు పోలీసుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. సిబ్బంది కొరతతో పోలీసులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా యల్లనూరురోడ్డు, కృష్ణాపురం జీరోరోడ్డు, పుట్లూరురోడ్డు ప్రాంతాల్లో కళాశాలలు ఎక్కువగా ఉండడంతో ఆ ప్రాంతాల్లో గంజాయి తీసుకునే యువకులు నిత్యం సంచరిస్తు, వి ద్యార్థినులను ఇబ్బంది పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంజాయితోపాటు తెల్లగా పౌ డర్ రూపంలో ఉన్న పదార్థాన్ని పీలుస్తూ కొంతమంది యువకులు మత్తు లో మునిగితేలుతున్నారు. దీంతో భయం, ఏమి చేస్తున్నామో అనే స్పృహ లేకుండా దాడులకు తెగబడుతున్నారు.



గంజాయి తీసుకుంటున్న యువకులు

రోడ్లపై ప్రమాదకరమైన బైక్ స్టంట్‌లు

పట్టణంలోని కొన్ని వీధుల్లో రాత్రిపూట గంజాయి బ్యాచ్ ద్విచక్రవాహనాలతో హల్‌చల్ చేస్తోంది. గంజాయి మత్తులో ఉన్న కొంతమంది పట్టణంలోని యల్లనూరు, సీబీ రోడ్డు, పుట్లూరురోడ్డు, నంద్యాలరోడ్డు ప్రాంతాల్లో బైక్ స్టంట్‌లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వాహనం కింద పడి ప్రమాదం జరిగితే వారితోపాటు సమీపంలో ఉన్నవారు కూడా తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ఇప్పటికే బైక్‌స్టంట్‌లు నిర్వహించినవారు కిందపడి గాయపడ్డ సంఘటనలు ఉన్నాయి. ఎవరైనా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు వచ్చే సమయానికి వెళ్లిపోయి తిరిగి వచ్చి అదేపనిగా స్టంట్స్ చేస్తున్నారు. దీనంతటికి గంజాయి వంటి పదార్థాల సేవనమే కారణమని పలువురు పేర్కొంటున్నారు. కాగా బైక్‌స్టంట్‌లు చేసిన వారిపైన పోలీసులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, అందుకే వారు మత్తులో రెచ్చిపోతున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం



తాడిపత్రి, పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పుడు జరిగిన కొన్ని సంఘటనల్లో అతిగా మద్యం సేవించి దాడులు చేశారని మా దృష్టికి వచ్చింది. వారిపైన కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించాం. సాయంత్రం వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తాం. సమస్య ఏదైనా మా దృష్టికి రాగానే చర్యలు తీసుకుంటున్నాం.

- రామకృష్ణుడు, డీఎస్పీ

ప్రమాదాల దారులు..!

- దెబ్బతిన్న వంతెనలు .. కనిపించని రక్షణ దిమ్మెలు
- చోద్యం చూస్తున్న అధికారులు



ధర్మవరం చివరి మరువ సమీపంలో దెబ్బతిన్న వంతెన

ధర్మవరం రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాలు తిరిగే రహదారుల్లో ప్రమాదాలు పొంచి ఉన్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ధర్మవరం మండలంలోని ఏలుకుంట్ల, నేలకోట, దర్శినమల, నడిమిగడ్డపల్లి, బిల్వంపల్లి, ఓబుళనాయునిపల్లి, మల్లాకాల్వ, చిన్నూరుబత్తలపల్లి గ్రామ ప్రజలు నిత్యం ధర్మవరం చెరువు కట్ట కింద రహదారిలో ప్రయాణిస్తుంటారు. బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ఆ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చెరువు కట్ట సమీపంలో చివరి మరువ సమీపంలో వంతెన కుంగి దెబ్బతింది. ఒకవైపు దెబ్బతినడంతో మరో వైపు మాత్రమే పోవాల్సి ఉంది. ఆ బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ దిమ్మెలు కూడా లేవు. ప్రస్తుతం చెరువు మరువలతో నీరు ఉధృతంగా పారుతోంది. వంతెన సమీపంలో ఒక పక్కభాగం పూర్తిగా దెబ్బతిని గుంత ఏర్పడింది. ఎదురుగా వాహనం వచ్చినా.. రాత్రివేళల్లో చూసుకోకుండా పోయినా ప్రమాదానికి గురికావాల్సిందే. ఆ గ్రామాల ప్రజలు ఆ రహదారి గుండా వెళ్లాలంటే భయపడుతున్నారు. ఆ వంతెన వద్ద ద్విచక్రవాహనాలు అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొట్లూరు నుంచి తుమ్మల, సుబ్బరావుపేటకు వెళ్లే రహదారిలో గొట్లూరు వద్ద వంతెన దెబ్బతింది. గతంలో వర్షానికి కింద కల్వర్టు కొట్టుకుపోవడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం అక్కడ ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారుల్లో ప్రయాణం చేయాలంటే ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళనగా ఉందని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జిలను బాగు చేయాలని, ఇరువైపులా దిమ్మెలు ఏర్పాటు చేసి ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గొట్లూరు నుంచి తుమ్మలకు వెళ్లే రహదారిలో దెబ్బతిన్న వంతెన

అధ్వాన స్థితిలో యంత్రాలు..!

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అస్తవ్యస్తం
- వేతనాల కోసం కార్మికుల ఎదురుచూపు

కళ్యాణదుర్గం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ఎన్నో గ్రామాల దాహార్తిని తీర్చింది. కుగ్రామాలకు సైతం ఈ పథకంతో నీరు సరఫరా అవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించేశారు. నిర్వహణ లోపం, అధికారుల నిర్లక్ష్యం వెరసి పథకం యంత్రాలు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. కార్మికులకు సైతం వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. కళ్యాణదుర్గం-రాయదుర్గం నియోజకవర్గాల్లో ఫేస్-4 కింద 204 మంది కార్మికులు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్నారు. దీని కింద నాలుగు పంపుహౌస్‌లు ఉన్నాయి. కంబదూరు మండల పరిధిలోని కదిరిదేవరపల్లి, శెట్టూరు మండల పరిధిలోని కంబాలపల్లి, కుందుర్పి మండల పరిధిలోని మహంతపురం గ్రామాల్లో పంపుహౌస్‌లను ఏర్పాటు చేశారు. 325 గ్రామాలకు ఈ పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం సక్రమంగా సాగింది. కార్మికులకు కూడా సక్రమంగా ప్రతి నెలా జీతాలు అందించేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక పథకాన్ని భ్రష్టు పట్టించారు. మరమ్మతులు కూడా కరువైపోయాయి. జీతాలు అందించండి మహాప్రభో అంటూ కార్మికులు రోడ్డెక్కాల్సి వచ్చింది.



పంపుహౌస్‌లో సామర్థ్యం కోల్పోతున్న పంపింగ్ మోటార్లు

నిర్వహణపై నిర్లక్ష్యం

శ్రీరామిరెడ్డి పథకం పంపులన్నీ అధ్వానస్థితికి చేరాయి. వైసీపీ హయాంలో చేసిన నిర్లక్ష్యానికి పీవీసీ, ఇనుప పైపులు, మోటార్లన్నీ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. కళ్యాణదుర్గం పంప్‌హౌస్‌లో 6 మోటార్లు, శెట్టూరు మండలం కంబాలపల్లి పంపుహౌస్‌లో 6 మోటార్లు, కంబదూరు మండలం కదిరిదేవరపల్లి పంపుహౌస్‌లో 3 మోటార్లు, కుందుర్పి మండల పరిధిలోని మహంతపురంలో 2 మోటార్లు ఉన్నాయి. ఈ మోటార్లన్నీ పంపింగ్ సామర్థ్యాన్ని రోజురోజుకీ కోల్పోతున్నాయి. 2011లో వీటిని ఏర్పాటు చేశారు. 14 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మోటార్లు కావడంతో లోడింగ్ కెపాసిటీ తగ్గుతోంది. దీంతో ఎక్కడ చూసినా తరచూ పైపులు లీక్ అవుతున్నాయి. పైపులు పగిలిపోతుండడంతో నీళ్లన్నీ పైకి ఎగచిమ్ముతున్న దృశ్యాలు ప్రధాన రహదారుల్లో నిత్యం కనిపిస్తున్నాయి.

ఆ రెండు నెలల జీతాలు ఎక్కడికెళ్లాయి..?

డిసెంబరు 2023, జనవరి 2024 ...ఈ రెండు నెలల జీతాలు కార్మికులు ఇవ్వలేదు. అసలు ఇస్తారో ఇవ్వరో కూడా తెలియని పరిస్థితి. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై కార్మికుల కడుపున కొట్టారన్న విమర్శలు ఉన్నాయి. అప్పట్లో పనిచేసిన కాంట్రాక్టర్, అధికారులు ఒకరిమీద ఒకరు సాకులు చెప్పుకుంటూ వస్తున్నారే కానీ వేతనాలకు సంబంధించిన సమాధానం లేదు. కార్మికులు అడిగి...అడిగి చివరికి విసిగిపోయారు.

నాలుగు నెలలుగా అందని జీతాలు

2024 సంవత్సరం అక్టోబరు నుంచి ఇప్పటి వరకు కార్మికులకు జీతాలు అందలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇలాగైతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు ఎప్పుడు వస్తాయో ఏమోనని ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా కష్టాలు తీరుతాయా అని ఎదురు చూస్తున్నారు.



పైపులు పగిలిపోవడంతో ఎగిసిపడుతున్న నీరు (ఫైల్)

కార్మికుల కష్టాలు తీర్చాలి



కూటమి ప్రభుత్వంలోనైనా శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల కష్టాలు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలి. మూడు నెలల నుంచి జీతాలు అందకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారు. ఉన్నతాధికారులు కూడా స్పందించాలి. లేనిపక్షంలో కార్మికులకు అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

- నాగేంద్రకుమార్, జిల్లా కార్యదర్శి, సీఐటీయూ

మోటార్ల సామర్థ్యాన్ని పరిశీలిస్తాం



కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని నాలుగు పంపుహౌస్‌లలో ఉన్న మోటర్ల సామర్థ్యాన్ని పరిశీలిస్తాం. అనంతరం ఉన్నతాధికారులు వివరించి, కొత్త మోటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. కార్మికులకు పెండింగు జీతాలు త్వరలోనే మంజూరవుతాయి. ఆ దిశగా ఉన్నతాధికారులు కూడా చర్యలు చేపట్టారు.

- మద్దయ్య, ఏఈ, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం

జీడిపల్లికి 767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 767 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 448 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు.

క్రైం కార్నర్

అర్ధాంగితో గొడవలు.. ఆత్మహత్యలు



పెద్దన్న (ఫైల్)

నల్లమాడ/ఓబుళదేవరచెరువు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భార్య భర్తలు కలహాలు టీ కప్పులో తుపానులా ఆగిపోవాలే కానీ.. ఆయా కుటుంబాలను చిన్నాభిన్నం చేయరాదు. కోపతాపాలు, అలకలు మధుర స్మృతులుగా మిగలాలే కాని భవిష్యత్తుకు శాపంగా మారకూడదు. క్షణికావేశంలో భార్య లేదా భర్త తీసుకునే నిర్ణయాలకు ఆయా కుటుంబాల్లో ఎందరో బాధితులవుతున్నారు. గొడవపడిన క్షణంలో తాము ఆత్మహత్య చేసుకుంటే కన్నబిడ్డలు ఏమవుతారో? వారి భవిష్యత్తు ఏమిటో అని ఒక్కసారి ఆలోచిస్తే ప్రాణం తీసుకునేంత సాహసం చేయరేమో..! కానీ ఆవేశంతో విచక్షణ కోల్పోయి ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలే నల్లమాడ, అమడగూరు మండలాల్లో జరిగాయి. దంపతుల మధ్య జరిగిన గొడవతో భార్య పుట్టింటికి వెళ్లి రాకపోవడం, భర్త మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు సోమవారం జరిగాయి. నల్లమాడ మండలంలోని రెడ్డిపల్లి రామాపురం గ్రామానికి చెందిన పెద్దన్న(41) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన మూడు రోజుల కిందట భార్య రాధమ్మతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య తిరిగి రాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెంది, ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

- అమడగూరు మండలంలోని కొలిమిరాళ్లపల్లికి చెందిన ఉప్పుతోళ్ల గంగాధర్ (35) ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గంగాధర్‌తో అతడి భార్య రెండు నెలల కిందట గొడవపడి పిల్లలతో పుట్టినింటికి వెళ్లిపోయింది. మృతుడికి తల్లి చిన్నతనంలో మృతి చెందగా, తండ్రి బాగేపల్లి అనాథాశ్రమంలో జీవిస్తున్నాడు. పలకరించేవారు లేక తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంతో మద్యం సేవించి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని, శవాన్ని కదిరికి తరలించినట్లు ఎస్ఐ వెంకటనారాయణ వెల్లడించారు.

చైన్ స్నాచర్ల అరెస్టు

గుంతకల్లు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బైకులను చోరీ చేసి, వాటిపై వెళుతూ చైన్ స్నాచింగ్ చేస్తున్న ఇద్దరిని కసాపురం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గుత్తి పట్టణానికి చెందిన ఎం.రాముడు, ఎం ప్రవీణ్ కుమార్ గుంతకల్లు వీవీ నగర్, జగ్జీవన్ రాం కాలనీల్లో ఇద్దరు మహిళల మెడలోంచి బంగారు తాళిబొట్లను తెంచుకుపోయారని సీఐ ప్రవీణ్ కుమార్ సోమవారం తెలిపారు. వీరి కదలికలపై నిఘా ఉంచి, భగత్‌సింగ్ నగర్‌లో అరెస్టు చేశామని తెలిపారు. వారి నుంచి రూ.60 వేల నగదు, మూడున్నర తులాల బంగారు తాళిబొట్టును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గుత్తిలో చోరీ చేసిన ఐదు బైక్‌లను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను పట్టుకుని, సొమ్ము రికవరీ చేసిన కసాపురం ఎస్ఐ టీపీ వెంకట స్వామి, హెడ్ కానిస్టేబుళ్లు సుంకన్న, వెంకటేశ్, పలువురు కానిస్టేబుళ్లను అభినందించారు.

బైక్‌లో ఇరుక్కుని తెగిపడిన మహిళ చెయ్యి

డీ.హీరేహాళ్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బైక్‌లో ప్రయాణిస్తున్న మహిళ ప్రమాదవశాత్తు చక్రంలో చేయి ఇరుక్కోవడంతో తెగిపడింది. పోలీసులు తెలిపిన మేరకు మండల కేంద్రానికి చెందిన చాకలి రాజేశ్వరి తన అల్లుడు సుధాకర్‌తో కలిసి పని నిమిత్తం కర్ణాటకలోని హోస్పేట్‌కు వెళ్లారు. పని ముగించుకుని సోమవారం ఉదయం తిరిగి ద్విచక్ర వాహనంపై అల్లుడితో కలిసి మండల కేంద్రానికి బయలుదేరారు. సిద్ధాపురం గ్రామం వద్దకు రాగానే ఆమె చీర బైక్ చక్రానికి చుట్టుకుంది. దీంతో ఆమె కిందకు పడుతున్నానని గ్రహించి చీరను చేతితో లాక్కొని ప్రయత్నం చేశారు. ఈక్రమంలో ఎడమ అరచెయ్యి బైకు చక్రంలో ఇరుక్కొని పూర్తిగా తెగి రోడ్డు పక్కన పడింది. స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. చికిత్స కోసం బళ్లారి విమ్స్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలియజేశారు.

టమోటా కిలో రూ.9

అనంతపురం రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.9తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

ఆలయాల్లో సత్యనారాయణ వ్రతం

అనంతపురం కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పుష్య మాస పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో బెంగళూరు రోడ్డులోని శివకోటి దేవాలయంలో వ్రతమండపాన్ని విశేషంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

ఫిర్యాదు విషయంపై రగడ

● దెబ్బలాడుకున్న కానిస్టేబుల్, మరో వ్యక్తి

అనంతపురం క్రైం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదు ఎక్కడ చేయాలనే విషయంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌కు, మరో వ్యక్తికి మధ్య గొడవ జరిగింది. నగరానికి చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి స్థానిక ఆర్టీఓ కార్యాలయ సమీపంలో తాను నిర్మిస్తున్న కొత్త ఇంటికి సంబంధించిన విద్యుత్ పరికరాల చోరీ గురించి ఎవరికి ఫిర్యాదు చేయాలని ఐరన్‌బ్రిడ్జి సమీపంలోని ఓ హోటల్ వద్ద ఉన్న కానిస్టేబుల్ నారాయణస్వామితో మాట్లాడాడు. అది వన్‌టౌన్ పరిధి కాదని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కానిస్టేబుల్ చెప్పారు. మరోసారి అడుగగా ఆ కానిస్టేబుల్ పట్టించుకోక పోవడంతో ఇమ్రాన్ దురుసుగా మాట్లాడాడు. దీంతో కోపం వచ్చిన కానిస్టేబుల్ రెండు దెబ్బలు వేశాడు. దీంతో ఇమ్రాన్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకున్నాడు. అంతే కానిస్టేబుల్ రెచ్చిపోయి, కింద పడేసి తన్నాడు. ఇద్దరూ దెబ్బలాడుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు వారిద్దరిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. తల వెనుక వైపు గాయాలు కావడంతో ఇమ్రాన్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ ఘటనపై కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించాడనే ఫిర్యాదుపై ఇమ్రాన్‌పై కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన మహిళలు ప్రత్యక్షం

అనంతపురం క్రైం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నగరంలో అదృశ్యమైన ఇద్దరు మహిళలను వన్‌టౌన్ పోలీసులు తీసుకొచ్చినట్టు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు. నగరంలోని సౌత్‌ఇండియా షాపింగ్‌మాల్‌లో పనిచేస్తున్న ఓ మహిళ ఈ నెల 8న అదృశ్యమైంది. కర్నూలులో ఉన్న ఆమెను పోలీసులు పిలిపించారు. అదేవిధంగా ఫెర్రర్ కాలనీలో నివాసముంటున్న మరో మహిళ తన 11ఏళ్ల కుమారుడితో కలిసి ఈనెల 10న అదృశ్యమైంది. ఆమెను ఫోన్ ఆధారంగా ట్రేస్ చేసిన పోలీసులు కడప జిల్లా లింగాలలో ఉండగా పిలిపించారు.

ఎమ్మెల్యే చొరవతో బస్టాండ్‌లోకి బస్సులు

● ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు, ప్రజలు



శింగనమల ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

శింగనమల జనవరి 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన శింగనమల ఆర్టీసీ బస్టాండ్ అవరణంలోకి గత 15 ఏళ్లగా బస్సులు వచ్చిన దాఖలాలు లేవు. ప్రయాణికు లు బస్సు ఎక్కాలంటే పక్క ఉన్న రోడ్డుకు వెళ్లాల్సిందే. దీంతో బస్టాండ్ శిథిలావస్థకు చేరుతోంది. ఈ సమయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవవతో పది రోజుల నుంచి బస్సులను ఆర్టీసీ బస్టాండ్ తీసుకెళ్తున్నారు. ప్రయాణికులు బస్టాండ్ అవరణంలో బస్సు ఎక్కుతున్నారు. దీంతో ప్రయాణికులు, మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శింగనమలలో ఆర్టీసీ బస్టాండ్‌ను 1989లో నిర్మించారు. అయితే కొన్నిరోజులు బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి, వెళ్లేవి. అయితే బస్టాండ్‌లో ఆర్టీసీ సిబ్బంది లేకపోవడంతో దాదాపు 15 ఏళ్లగా బస్సులు బస్టాండ్ ఆవరణంలోకి రావడం లేదు. ఉన్న మూడు బస్సులను బస్టాండ్ పక్కన రోడ్డులో నిలిపి ప్రయాణికులను ఎక్కించుకునేవారు. దీంతో బస్టాండ్ నిరుపయోగంగా మారి శిథిలావస్థ కు చేరుతోందని శింగనమల గ్రామస్థులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. అమె బస్టాండ్‌ను పరిశీలించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. అలాగే ఈ 6న శింగనమలలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆర్టీసీ డీఎంకు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్టీసీ ఆధికారులు బస్సులను బస్టాండ్ అవరణంలోనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. బస్సుల వేళల ఫ్లెక్సీని బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. దాదాపు 15 ఏళ్ల తరువాత బస్సులు బస్టాండ్ అవరణంలోని శింగన మల మండల ప్రజలు, ప్రయాణికులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతు న్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని, బస్టాండ్‌లో సిబ్బందిని ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

సంక్రాంతి సంబరాలు



శిల్పారామంలో భోగి మంటలు వేసిన దృశ్యం



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అనంతపురం రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని శిల్పారామంలో సాంస్కృతి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. ఏఓ క్రిష్ణప్రసాద్ సంబరాలను ప్రారంభించారు. అందులో భాగంగా సోమవారం భోగి మంటలు వేశా రు. రంగన్న వారి బృందంచే గంగిరెద్దుల ప్రదర్శన నిర్వహించారు. మాన స నృత్యకళా కేంద్రం ఆధ్వర్యంలో మహాగణపతి, స్వాగతం కృష్ణా, గోదా రి గట్టుమీద, కెరటాల నడుము తదితర గేయాలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులు కీర్తిశ్రీ, అనూష, పల్లవి, సాయిప్రసాద్, నిక్షిత, జ్ఞాన హారిక, వైష్ణవి, హర్షిత, గౌతమి, అనుశ్రీ, పృధ్వీ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి/కనగానపల్లి: సంక్రాంతి సందర్భంగా రామగిరి, కనగానపల్లి మండలాల్లో సోమవారం భోగి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే వీధుల్లో భోగి పంటలు వేశారు. ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేశారు. ఇతర ప్రాంతాల నుంచి ఉద్యోగులు, విద్యార్థులు తరలివచ్చి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్, సీఐటీయూ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించు కుని సోమవారం స్థానిక రెండో రోడ్డులోని స్టడీపార్కులో డిస్కవర్ అనంతపురం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా పారిశుధ్య కార్మికులకు ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని డిస్కవర్ అనంతపురం ఏజీ అనిల్‌కుమార్, ఏజీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఏజీ ప్రమీలమ్మ తెలిపారు. అనంతరం విజేతలకు గ్యాస్ స్టవ్‌లు, మిక్సీలు, ఐరన్‌బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగరాజు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు : మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. టీడీపీ నాయకులు శశాంక చౌదరి, మాధవరెడ్డి, మనోరంజన్, వేణుగోపాల్, సుబ్బర హరి, కార్తీక్, కందుల ఓబులపతి, తిక్కస్వామి, లక్ష్మదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో బహుమతులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆస్పత్రి కమిటీకి కలెక్టర్ ఆమోదం..?

● సంక్రాంతి తర్వాత అధికారికంగా ప్రకటన

అనంతపురం టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : జిల్లా సర్వజనాస్పత్రి అభివృద్ధి నూతన కమిటీ ఎంపికపై దాదాపు కసరత్తు పూర్తి అయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జిల్లాకు గుండెలాంటి జిల్లా ఆస్పత్రి అభివృద్ధిలో ఈ కమిటీ కీలకపాత్ర పోషిస్తుంది. అందుకే ఈ కమిటీలో స్థానం దక్కించుకునేందుకు చాలా మంది ఆరాటపడుతుంటారు. అదేస్థాయిలో ఎంపికకు అంత ప్రాధాన్యం ఉంటుంది. ఈ కమిటీ పదవీ కాలం రెండేళ్లు. గత వైసీపీ హయాంలో ఏర్పడిన కమిటీ కాలం ముగిసింది. ఇపుడు టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో నూతన కమిటీ ఏర్పాటుకు కొద్దిరోజులుగా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఎట్టకేలకు కమిటీ సభ్యులుగా విశాలఫెర్రర్, టీడీపీ నేత కోనంకి గంగారామ్, సామాజిక సేవా కార్యకర్తలు ఆలంబన జనార్దన్, క్యాటరింగ్ రమణ పేర్లు ఖరారు చేసినట్లు సమాచారం. ఇంకోపేరును కలెక్టరు పెడింగ్ పెట్టినట్లు తెలిసింది. ఈ నలుగురు కమిటీ సభ్యుల కు కలెక్టరు ఆమోదం తెలిపినట్లు, సంబంధిత ఫైల్ ఆస్పత్రికి చేరినట్లు సమాచారం. కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, కోచైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే కొనసాగుతారు. ఈ నూతన కమిటీని సంక్రాంతి పండుగ తర్వాత అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు చర్చించుకుంటున్నాయి.

అగ్నికి ఆహుతైన శ్రీగంధం చెట్లు



కాలిపోయిన శ్రీగంధం చెట్లు

కనగానపల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్ళపల్లిలో భరత్‌రెడ్డి అనే రైతుకు చెందిన శ్రీగంధం చెట్లు సోమవారం అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన భరత్‌రెడ్డి ఐదెకరాల్లో శ్రీగంధం చెట్లు సాగుచేస్తున్నాడు. ఆ తోటలో మంటలు వ్యాపిస్తున్నాయని స్థానిక రైతులు అతడికి సమాచారం అందించారు. అతడు వెంటనే రైతులతో వెళ్లి వెళ్లి మంటలు ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే చెట్ల మధ్య ఉన్న ఎండుగడ్డి వలన మంటలు మరింత వ్యాపించి చెట్లన్నీ కాలిపోయాయిని బాధిత రైతు వాపోయారు. ఐగేళ్లుగా చెట్లను కాపాడుతున్నానని, ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనతో తీవ్రంగా నష్టపోయాయని బాధిత రైతు వాపోయాడు.

వాతావరణ మార్పులపై విద్యార్థులకు పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో వాతావరణ కేంద్రం అధికారులు

అనంతపురం రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వాతావరణ మార్పులపై సోమవారం వాతావరణ కేంద్రంలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. ఇండియా మెట్రోలా జికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ)వాతావరణ శాఖ ఏర్పాటై జనవరి 15 నాటికి 150ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. ఈ సందర్భంగా వాతావరణ కేంద్రం పైలట్ బెలూన్ అబ్జర్వేటరీ పాఠశాల విద్యార్థులకు వాతావరణ మార్పులు, హెచ్చరికలు, గ్లోబల్ వార్మింగ్, డిజాస్టర్ మేనేజ్మెంట్ తదితర అంశాలపై ఉపన్యాసం, వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలను నిర్వహిం చారు. వీటిలో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు, సర్టిఫికెట్లను వాతావరణ కేంద్రం ఇన్‌చార్జ్ వంశీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ, వాతావరణ అధికారులు నిఖిలేశ్వర్‌గౌడ్, మెంకటమాధురి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్‌కు తక్కువ వడ్డీతో రుణాలివ్వాలి'

గార్లదిన్నె, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అమలు చేస్తున్న సూర్యఘర్ సౌరవిద్యుత్ పథకానికి బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలివ్వాలని రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం గార్లదిన్నెలో కెనరా బ్యాంకు అధికారులను పలువురు రైతులతో పాటు కలసి వినతి పత్రాన్ని అందజేశారు. తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేస్తే సామాన్యులకు వెసులుబాటు అవుతుందన్నారు. సంఘం సభ్యులు తాతిరెడ్డి, శివశంకర్, నీలకంఠ, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ దాతృత్వం

అనంతపురం కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్కే నగర్‌లో ఉంటున్న బిలాల్ ఆటో డ్రైవర్. అనుకోని ప్రమాదం వల్ల బిలాల్ కుమారుడు 18 నెలల అలీ అబ్బాస్‌పై వేడినీళ్లు పడడంతో శరీరం కాలిపోయింది. కర్నూలు ఆస్పత్రికి తరలించారు. వైద్య ఖర్చుల కోసం ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు వ్యవస్థాపకులు తాడిమర్రి లాల్ బాషా, ముంతాజ్ రూ.15వేలు సేకరించి సోమవారం వారికి ఇచ్చారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి: సీపీఎం



జిల్లాకేంద్రంలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెరుగుదలను నిరసిస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 198 ప్రాంతాల్లో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. జిల్లా వ్యాప్తంగా వామ పక్ష నాయకులు పాల్గొని నిరసన తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ తాడిపత్రి కేంద్రంలో, సీనియర్ నాయకుడు ఓబులు శింగనమల మండలం తరిమెల, నిదనవాడ గ్రామాల్లో, జిల్లా కార్యదర్శి నల్లప్ప బుక్కరాయసముద్రం, కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, నాగేంద్రకుమార్ అనంతపురం నగరంలో, శ్రీనివాస్ గుంతకల్లులో, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి గార్లదిన్నెలో, కృష్ణమూర్తి కూడేరులో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతపురం నగరంలో 35 కూడళ్ల వద్ద సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్వీ నాయుడు, వెంకటనారాయణ, ముత్తుజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మునుపు విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమని విమర్శించి, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీల రూపంలో వేల కోట్లు భారం మోపడం తగదని విమర్శించారు. ప్రభుత్వం వెం టనే విద్యుత్ చార్జీల పెంపుదలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వలి, ప్రకాష్, ఎన్టీఆర్ శీనా, ఏటీఎం నాగరాజు, ఎర్రిస్వామి, తిరుమలేష్, గోపాల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదారంగనాథ కల్యాణోత్సవం



కాశీవిశ్వేశ్వరాలయంలో కల్యాణోత్సవం

అనంతపురం కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నగరంలోని పలు ఆలయాల్లో గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయం, అరవింద నగర్‌లోని కృష్ణమందిరం, వేణుగోపాల్ నగర్ సాయినాథ మందిరం, అశోక్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి తదితర దేవాలయాల్లో ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాద, అన్నదాన వినియోగం చేశారు.

సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి



సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఆత్మీయులు, స్నేహితుల పిలుపు మేరకు పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో సోమవారం క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై ఆనందంగా గడిపారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు.

కనకదాస జయంతి పోస్టర్ల విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా మదనపల్లిలోని రాంతులసి కల్యాణమండపంలో ఈ నెల 21న జరిగే కనకదాస జయంతి, సంఘం రాష్ట్ర జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కురబ సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. సంబంధిత పోస్టర్లను సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆవిష్కరించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే 537వ కనకదాస జయంత్యుత్సవాలకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పలువురు ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. కావున కురబ కులస్థులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు విఠల్‌గౌడ్, వశికేరి లింగమూర్తి, కృష్ణంరెడ్డిపల్లి కాట మయ్య, వశికేరి శివ, వశికేరి రమేష్, సోమశేఖర్, బండి కాశీ విశ్వనాథ్, రాగే గోపాల్, గుడి రామాంజనేయులు, గుడే శ్రీనివాసులు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తపై పోలీసులకు ఫిర్యాదు

బెళుగుప్ప, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వైసీపీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ద తిప్పయ్య సోమవారం మండలకేంద్రంలోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి కేశవ్ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారని, దీనిపై మండలంలోని యలగలవంక గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో దూషిస్తూ పోస్టు పెట్టాడని అన్నారు. రాష్ట్ర మంత్రిని ఇలా మాట్లాడటం సబబుకాదని అడిగితే.. నా ఇష్టం ఏమి చేసుకుంటారని బెదిరించాడని కూడా తెలిపారు. విచారించి చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంతపురం రోడ్డులో గల స్టేట్‌బ్యాంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్‌బీఐ కాలనీకి చెందిన రంగనాయకులు పని నిమిత్తం బజారుకు వెళ్లి రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం అక్కడే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

యాడికి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు వద్ద ఆదివారం రాత్రి ఓ వ్యక్తి రైలుకిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కేశవరాయునిపేట గ్రామానికి చెందిన క్రిష్టప్ప కుమారుడు సుంకన్న లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా వారి కులానికి చెందిన సంఘంలో అతను గత సంక్రాంతికి రూ.3లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ప్రస్తుతం సంక్రాంతిరోజు ఆ డబ్బులు చెల్లించవలసి ఉంది. అయితే చేతిలో డబ్బు లేకపోవడంతో ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై రాయలచెరువు వద్ద రైలుకిందపడి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రమాదంలో రెండూ పూర్తిగా తెగిపోయాయి. గాయపడిన సుంకన్న ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు వచ్చి చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. సుంకన్న పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

విద్యుత్ స్తంభాల ధ్వంసంపై ఫిర్యాదు


నేలకొరిగిన విద్యుత్ స్తంభం

విడపనకల్లు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలికి గ్రామంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ ఢీకొట్టడంతో రెండు విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయని విద్యుత్ ఏఈ సత్యం సోమవారం తెలిపారు. పొలికి గ్రామానికే చెందిన గాదిలింగ, మీసాల రామాంజనేయులు అనే వ్యక్తులు ట్రాక్టర్‌తో ఓ వీధిలోని రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టారన్నారు. దీంతో ఒక స్తంభం పూర్తిగా విరిగి పోయి నేలకు ఒరిగిందని, మరొకటి కింద భాగం శిథిలమైందని అన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

యాడికి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌లో తరలిస్తున్న పశుగ్రాసానికి కరెంట్ వైర్లు తగులుకొని మంటలు చెలరేగాయి. దీంతో గ్రాసం కొద్దిమేర కాలిపోయింది. ఈ సంఘటన మండలకేంద్రంలోని కోనరోడ్డులో సోమవారం జరిగింది. కోనుప్పలపాడుకు చెందిన శివయ్య యాడికిలో జొన్నచొప్పను కొనుగోలుచేశాడు. ఆదివారం మధ్యాహ్నం ట్రాక్టర్‌లో స్వగ్రామానికి తరలిస్తుండగా కరెంట్‌వైర్లు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. ట్రాక్టర్‌లో ఉన్న జొన్నచొప్పకు మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో డ్రైవర్ అప్రమత్తతతో గ్రాసాన్ని ట్రాక్టర్ నుంచి కిందకు అన్‌లోడ్ చేశాడు. దీంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రూ.10 వేల విలువగల గ్రాసం కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

చెస్ ఓపెన్ కేటగిరిలో పృథ్వీరాజ్ ప్రతిభ



బహుమతి అందకుంటున్న పృథ్వీరాజ్‌గౌడ్

గుంతకల్లుటౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫైడ్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ కేటగిరీలో పట్టణానికి చెందిన పృథ్వీరాజ్‌గౌడ్ ప్రతిభ చూపారు. పట్టణానికి చెందిన పృథ్వీరాజ్‌గౌడ్ అనంతపురం హంద్రీనీవా ప్రాజెక్టు కార్యాలయంలో ఏఈఈగా పనిచేస్తున్నారు. కాగా అతను విజయవాడలో బీఎస్‌కేయూ ఆధ్వర్యంలో ఈనెల 10నుంచి 12 వతేదీ వరకు నిర్వహించిన అంతర్జాతీయ ఫైడ్ చెస్ టోర్నీలో పాల్గొని ప్రతిభ చూపారు. ఓపెన్ కేటగిరీలో 7/9పాయింట్లతో 13వ స్థానంలో నిలిచారు. సోమవారం నిర్వాహకుల చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.

చంద్రమౌళేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి

శెట్టూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగి సందర్భంగా మండలకేంద్రంలోని చెరువుకట్ట సమీపంలో ఉన్న చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే స్వామి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, పుష్పాలంకరణ చేసి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా మెల్విన్‌జోన్స్ జయంతి

ఉరవకొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెల్విన్‌జోన్స్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. క్లబ్‌సభ్యులు జయకృష్ణ, జాబీర్, గణేష్ బాబు, జీకే శ్రీధర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన జేసీ క్రికెట్ టోర్నమెంట్

తాడిపత్రి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న జేసీ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా మొదటిమ్యాచ్‌లో యోయో స్ట్రైకర్స్, రఘులెవన్ జట్ల మధ్య పోటీ జరిగింది. యోయో జట్టు 75పరుగులు సాధించింది. రఘు లెవన్ జట్టు 6.1ఓవర్లలో విజయాన్ని సాధించింది. తర్వాత జరిగిన మ్యాచ్‌లో చౌడేశ్వరి నరసాపురం, వెంకటాంపల్లి ఫ్రెండ్స్ జట్లు పోటీపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన నరసాపురం జట్టు 64పరుగులు చేసింది. అనంతరం వెంకటాంపల్లి జట్టు 4.3ఓవర్లలోనే విజయాన్ని చేధించింది. అనంతరం మరో రెండు మ్యాచ్‌లు జరిగాయని నిర్వాహకులు సుధీర్, విజ్జి, కందన్ తెలిపారు.

కొనసాగిన ఎన్‌టీఆర్ కబడ్డీ పోటీలు

బొమ్మనహాళ్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఎన్‌టీఆర్ కబడ్డీ పోటీలు సోమవారం రెండో రోజు కొనసాగాయి. హోరాహోరీగా పోటీలు జరిగాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఎనిమిది జట్లు గెలుపే లక్ష్యంగా ప్రత్యర్థిజట్లతో తలపడ్డాయి. మంగళవారం సెమీఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నీ నిర్వాహకులు పయ్యావుల అనిల్, పయ్యావుల శ్రీకాంత్, నవీన్ తెలిపారు.


గుంతకల్లులో భోగి వేడుకలో టీడీపీ నాయకులు


గుత్తి ఆర్‌ఎస్‌లో భోగి మంట వేసిన స్థానికులు


తాడిపత్రిలోని శ్రీనివాసపురంలో..

ఊరూ వాడా.. భోగి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమవారం భోగి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో సైతం వేకువజామునే మహిళలు ఇళ్ల ముంగిళ్లలో కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేశారు. అందులో గొబ్బెమ్మలను ఉంచి గుమ్మడికాయలు కొట్టి పూజలు చేశారు. అలాగే పిల్లలు పెద్దలు భోగిమంటలు వేసుకుని ఆనందంగా గడిపారు. తర్వాత ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. సాంప్రదాయ పిండి వంటలను చేశారు. సాయంత్రం చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. పిల్లలు గాలిపటాలను ఎగురవేశారు.


శెట్టూరులో ఇళ్ల ముంగిట రంగవల్లులు , గుత్తి మండలం గొందిపల్లిలో..

ఆలయాలను సందర్శించిన ఐఏఎస్‌లు


బుగ్గరామలింగేశ్వరాలయంలో శిల్పకళ గురించి అధికారులకు వివరిస్తున్న అర్చకులు

తాడిపత్రి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాలను సోమవారం ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి, కలెక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సందర్శించారు. అర్చకులు వారికి పూర్ణ కుంభస్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించారు. అలాగే తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. తర్వాత వారు ఆలయాలను కలియ తిరిగారు. శిల్పకళను తిలకించి ఎంతో బాగుందని అన్నారు. ఆలయాల చరిత్రను అర్చకులు అధికారులకు వివరించారు. అనంతరం మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలో సిద్ధార్థ కోల్డ్ స్టోరేజీని పరిశీలించారు. కోల్డ్ స్టోరేజీలో పండ్లరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగితెలుసుకున్నారు. స్టోరేజీ సామర్థ్యం గురించి సిబ్బందిని ఆరాతీశారు. అలాగే ఆ అధికారులు మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మున్సిపల్ విస్తీర్ణం ఎంత, జనాభా ఎంత, క్లీన్ అండ్ గ్రీన్, వాటర్, అండర్‌డ్రైనేజీ తదితర అంశాలపై ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అక్కడ ఉన్న ఫోటో గ్యాలరీని ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీని ప్లాస్టిక్‌రహిత పట్టణంగా మార్చామని, ప్లాస్టిక్ నిషేధానికి ఇక్కడ ప్రజల సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఆయన వెంట ఏపీఎంఐపీడీ రఘునాథ్ రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి పల్లవి, తహసీల్దార్ రజాక్‌వలి, దేవాదాయశాఖ ఈఓ రామాంజనేయులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పండ్లతోటల పరిశీలన

పెద్దపప్పూరు/ పుట్లూరు: మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి గ్రామాల్లో ఉన్న అరటి, దానిమ్మ, చీనీ తోటలను ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి, కలెక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సోమవారం పరిశీలించారు. మండలంలో పండ్లతోటలు ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పండ్లతోటలకు అవసరమైన డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రభుత్వం రాయితీతో అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి పల్లవి, ఎండోమెంట్ అధికారి రామాంజనేయులు, తహసీల్దార్ బాలాజీ రాజు, ఎంపీడీఓ శకుంతల, ఏపీఓ గంగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే పుట్లూరు మండలంలోని ఏ. కొండాపురంలో ఉద్యానవన పంటలను కూడా వారు పరిశీలించారు. ఉద్యానవన రైతులతో తోటలోనే సమావేశం నిర్వహించి మాట్లాడారు. దానిమ్మ, చామంతి పంటలకు ఎంత పెట్టుబడి అవుతోందని, ఎంత మేర దిగుబడి తీస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ పంటలకు ప్రభుత్వం నుంచి ఏమైనా సహకారం లభిస్తుందా అని ఆరాతీశారు. రైతులు తీసే దిగుబడిపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం


రాయదుర్గంలో జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామివారు, గోదాదేవి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని జరిపారు. వేడుకలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం గోదాదేవి మహిళా మండలి ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. గ్రూపు ఆలయాల కార్యనిర్వాహణాధికారి నరసింహారెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో అర్చకులు వెంకటేశ్వరస్వామి, గోదాదేవి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రంగయ్య, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరటి చెట్ల నరికివేత కేసులో ఐదుగురికి రిమాండ్

పుట్లూరు, జనవరి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుగారికుంట గ్రామంలో ఈనెల 10వ తేదీన టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడుకు చెందిన అరటిచెట్లు నరికివేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి నిందితులను సోమవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు వివరాలను పుట్లూరు సీఐ సత్యబాబు వెల్లడించారు. టీడీపీకి చెందిన సుదర్శన్‌నాయుడు కుమ్మనమల పంచాయతీలో కీలకంగా వ్యవహరించేవారు. నిందితులు కూడా అదే పార్టీకి చెందినవారు కావడంతో సమస్య తలెత్తింది. ప్రభుత్వం వచ్చాక డీలర్, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు సుదర్శన్‌నాయుడు అడ్డుపడుతున్నాడనే ఉద్దేశంతో వారు కక్ష కట్టారు. దీంతో అతడి అరటిచెట్లను నరికేద్దామని మనోహర్, చిన్నపెద్దిరాజు, సూరి అలియాస్ సురేంద్ర, సురేష్‌లకు పెద్దిరాజు చెప్పాడు. దీంతో వారంతా పథకం పన్ని 1052చెట్లను నరికివేసి ఇంటికి వెళ్లారు. కేసు నమోదు చేసి నారాయణరెడ్డిపల్లి క్రాస్‌వద్ద వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

వివాహం చేసుకోలేదని ఫిర్యాదు

తాడిపత్రి, జనవరి13(ఆంధ్రజ్యోతి): తనను వివాహం చేసుకోలేదంటూ ఓ వ్యక్తిపై మండలంలోని వెంకటాంపల్లికి చెందిన రజియాబీ సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. రజియాబీకు నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన గౌస్‌బాషాతో ఏడాదిక్రితం వివాహం కుదిరింది. అప్పట్లో నిశ్చితార్థం కూడా చేశారు. అయితే వివాహం వాయిదా పడుతూ వస్తోంది. వివాహం చేసుకోవాలని పలుమార్లు కోరినపపటికీ గౌస్ బాషా మాట దాటవేస్తూ కాలయాపన చేశాడు. చివరికి అతడు పెళ్లి చేసుకోనని తెల్చి చెప్పాడు. దీంతో రజియాబీ రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆ మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు పార్టీల నాయకుల డిమాండ్

ఉరవకొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి ప్రతి ఎకరాకు సాగునీటిని అందించాలని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం వారు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం హంద్రీనీవా కాలువ పనులు లైనింగ్ కాకుండా వెడల్పు చేసి జిల్లాకు అదనంగా నీటిని తీసుకురావాలన్నారు. అలాగే డిస్ట్రిబ్యూటరీ పనులు వేగవంతంగా పూర్తి చేసి ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా జీబీసీకి అధికారికంగా సాగు నీరు విడుదల చేయాలన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి పీఏబీఆర్‌కు 11టీఎంసీల నికర జలాలను అందించాలన్నారు. మైక్రోడ్రిప్ ఇరిగేషన్ ద్వారా నియోజకవర్గంలో 55వేల ఎకరాలకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో వామపక్ష నాయకులు సుల్తాన్, మధుసూదన్, మల్లేష్, తిప్పయ్య, మురళి, రవి, రామాంజనేయులు, కాంగ్రెస్ నాయకులు బ్యాళ్ల ప్రసాద్, అబ్బాస్, సుధాకర్ పాల్గొన్నారు.

తాడిపత్రి ఏఎస్పీగా రోహిత్‌కుమార్ చౌదరి

తాడిపత్రి, జనవరి13(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ఏఎస్పీగా రోహిత్‌కుమార్‌చౌదరిని ప్రభుత్వం నియమించింది. సోమవారం ఐదుగురు ఐపీఎస్ అధికారులను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నియమించింది. అందులో భాగంగా 2022 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి రోహిత్‌కుమార్‌చౌదరిని తాడిపత్రికి నియమించారు.

విద్యుత్ చార్జీలను తగ్గించండి

● సీపీఎం డిమాండ్


తాడిపత్రిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తాడిపత్రి/ గుంతకల్లుటౌన్/ గుత్తి/ ఉరవకొండ/ కళ్యాణదుర్గం రూరల్/ రాయదుర్గం రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు రాంభూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గాంధీసర్కిల్లో సోమవారం విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం నాయకులు భోగిమంటల్లో కరెంట్‌బిల్లులను వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో విద్యుత్‌చార్జీలు పెంచమని చెప్పిన కూటమి మాట తప్పిందన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.1670కోట్లను ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు మేలుచేయడం తప్ప పేదలకు చేసిందేమి లేదని మండిపడ్డారు. పెంచిన చార్జీలను తగ్గించాలన్నారు. లేకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అలాగే గుంతకల్లు, గుత్తి, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం పట్టణాల్లోనూ సీపీఎం నాయకులు భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు.

ధరలేక.. గొర్రెలకు టమేత

● మార్కెట్లో అమాంతం పడిపోయిన టమోటా ధర
● గిట్టుబాటు గాక పొలాల్లోనే వదిలేస్తున్న రైతులు


బసంపల్లిలో గొర్రెలకు వదిలేసిన టమోటా పంట

శెట్టూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో రూ. లక్షలు పెట్టుబడి పెట్టి.. ఆరుగాలం శ్రమించి టమోటాను సాగు చేసిన రైతులకు చివరికి నిరాశ మిగిలింది. పంట దిగుబడి బాగా వచ్చిందని సంతోషించే లోపే .. మార్కెట్లో టమోటా ధరలు అమాంతం పడిపోయాయి. దీంతో ఆ రైతుల ఆనందం అంతా ఆవిరైపోయింది. చివరికి కోత కోసేందుకు కూలీల డబ్బులకు కూడా గిట్టుబాటు కాకపోవడం, మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చు లు మీద పడనుండడంతో చేసేదిలేక అన్నదాతలు పొలాల్లోనే టమోటా పంటను గొర్రెలకు మేతగా వదిలేస్తున్నారు. మండలంలోని బసంపల్లిలో అధికంగా ఈ పరిస్థితి చోటు చేసుకుంది. ఏమాత్రం ధర లేకపోవడంతోనే పంటను ఇలా మేతగా వదిలేస్తున్నామని, చాలా పెట్టుబడి నష్టపోయి తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


దర్గాహొన్నూరులో పూర్వవిద్యార్థులు

బొమ్మనహాళ్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 2010-11 వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు 14 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.

విద్యార్థులకు సన్మానం

గుంతకల్లు టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్‌కే కార్యాలయంలో అనంతపురం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పూలమాలలు, శాలువాలతో ఘన సన్మానం జరిగింది. ఈసందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గతేడాది విజయవాడలో జరిగిన 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన నందిని, గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి లవన్‌కుమార్ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. దీంతో వీరిని సన్మానించినట్లు చెప్పారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, కార్యదర్శి పాండురంగ, ఎంఈఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

ఉత్సాహంగా ముగ్గుల పోటీ

యాడికి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో యాడికి మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు సంబరంగా కొనసాగాయి. సుమారు 150మంది దాకా మహిళలు పోటీలో పాల్గొని ఉత్సాహంగా ముగ్గులు వేశారు. పోటీని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి తిలకించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిని పోలా సరిత, రెండో బహుమతిని దాసరి సరళ, మూడో బహుమతిని శరణ్య గెలుపొందారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, జనసేన మండల కన్వీనర్ సునీల్‌కుమార్, బీజేపీ మండల కన్వీనర్ చింతా చౌడయ్య, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

20న కలెక్టరేట్‌కు తరలిరండి

గుంతకల్లు టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసిందని, ఈనెల 20వ తేదీన దళిత సంఘాల నాయకులు వచ్చి సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో సోమవారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కులగణన తప్పుల తడకగా చేశారని, ఈ సమస్యలపై రంజన్‌మిశ్రా ఏకసభ్య కమిషన్‌కు విన్నవించడానికి నియోజకవర్గంలోని మాదిగలు కలెక్టరేట్‌కు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి నరసింహులు, దళిత సంఘాల నాయకులు తగరం రామాంజనేయులు, కేవీ స్వామిదాస్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డు ప్రారంభం

బ్రహ్మసముద్రం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేపులపర్తి గ్రామంలో ఉపాధి హామీ కింద నిర్మించిన గోకులం షెడ్డును టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడిరైతులు ఈ షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్లస్టర్ ఇన్‌చార్జ నాగరాజు, నాయకులు వన్నూరుస్వామి, అవినాష్, రవి, మాజీ సర్పంచ్ హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.